క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్, ఎంపీడీఓ

బేతంచెర్ల: సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దవరం, ఎం,పేండేకల్లు గ్రామ సచివాలయాలను వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఇంటి నిర్మాణాల ప్రగతిపై చర్చించారు. అనంతరం ఎం.పేండేకల్లు గ్రామంలో సాలిడ్ వెస్ట్‌మేనేజ్‌మెంట్ నిర్మాణానికి స్థలం సమస్య ఉండటంతో ఎపీఓ శేషన్నతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు శివ రామయ్య, పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్, సామే నాయక్ పాల్గొన్నారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

ప్యాపిలి: కిశోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం ఆమె కిశోర బాలికలకు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఆకు కూరలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకోవాలన్నారు. కౌమారదశలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, ఆశా వర్కర్లు సరోజమ్మ, రామలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషలో పట్టు సాధించాలి

డోన్ టౌన్: అంతర్జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్‌లైన్‌లో మూడు రోజుల పాటు హిందీ భాషలో విద్యార్థులకు విశాఖపట్నానికి చెందిన హిమజ్యోతి ట్రస్టు వారు ఇచ్చిన శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ మేరకు మంగళవారం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతి ఒక్కరు హిందీ భాషపై పట్టు సాధిస్తే ప్రపంచం అంతటా పర్యటించవచ్చని ఈ సంరదర్భంగా డోన్ డివిజన్ క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు ఆదాం తెలిపారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న వార్డెన్ వెంకటేశ్వర్లు

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమానికి ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు తన భార్య ఎద్దుల లక్ష్మిదేవి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం రూ.10వేల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సమావేశం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై బుధవారం వివిధ ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గతంలో అధికారులు స్థలాన్ని కేటాయించినప్పటికీ జాప్యమైందని, విగ్రహం ఏర్పాటుపై చర్చించేందుకు ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీకి నీటి సౌకర్యం



మోటార్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని 544–డీ జాతీయ రహదారి చెంతనే ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో నీటి సౌకర్యం కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం కాలనీలోని ఉన్న చేతి పంపు స్థానంలో మోటార్ ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం కావడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు మోటార్ అమర్చి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో అక్కడక్కడ మినీ ట్యాంకుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించామన్నారు.

'బిందు'...లాభాలు మెండు!

- డ్రిప్ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- 70–90 శాతం సబ్సిడీపై పరికరాలు
- సన్న, చిన్నకారు రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

బనగానపల్లె: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వ్యవసాయం దండగ కాదు... పండగ అనేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతన్నకు అన్నివిధాల అండగా నిలుస్తుంది. విత్తు నుంచి దిగుబడుల కొనుగోలు వరకు బాధ్యత తీసుకుంటుంది కూడా. పెట్టుబడి నిధి కింద భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా క్షేత్రస్థాయిలోనూ సాయం అందజేస్తుంది. ఈ క్రమంలోనే సేద్యం సులభతరం చేసేందుకు బిందు సేద్యం చేసేలా రైతులను ప్రోత్సహిస్తుంది. లభాలు మెండగా ఉండే బిందు సేద్యాన్ని అవలంభించేలా సబ్సిడీపై పరికరాలను పంపిణీ చేస్తుంది. డ్రిప్పు పరికరాలను 70–90శాతం రాయితీతో రైతులకు అందజేస్తూ తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే విధానంపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆ దిశగా రైతులు సైతం ముందుకు వస్తున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాలో రూ.30 కోట్లతో 5300 హెక్టార్లలో బిందు సేద్యం చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. డ్రిప్పు పరికరాల కోసం 10200 మంది రైతులు నమోదు చేసుకున్నారు. 3500 హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటుకు రైతులు సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని డీడీ చెల్లించారు. మార్చి నాటికి జిల్లాలో లక్ష్యం అధికమించే దిశగా సంబంధింత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ సపోట, అంజూర్, అరటి, కూరగాయాల సాగు స్ప్రింక్లర్ల ద్వారా చేసుకునేందుకు రైతులు డ్రిప్పులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటి ద్వారా నీటిని పొదుపుతో పాటు విద్యుత్ ఆదా చేయొచ్చు. పురుగు, తెగుళ్ల ఉధ్రుతి చాలా వరకు తగ్గుతుంది. కలుపు బెడద ఉండదు. మొక్క పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది. పంట దిగుబడి పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది.

బిందు సేద్యం పరికరాలకు రాయితీలు ఇలా

ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న సన్నచిన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్పు పరకరాలు పొందవచ్చు. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2.18లక్షలు వరకు రాయితీ ఉంటుంది. ఐదు నుంచి పది ఎకరముల భూమి ఉన్న రైతులు 70శాతం రాయితీతో పరికరాలు తీసుకోవచ్చు. ఒక్కో రైతు గరిష్టంగా రూ.3.46లక్షల వరకు రాయితీ పొందవచ్చు. అదేవిధంగా ఐదు ఎకరాల్లోపు సన్నచిన్నకారు రైతులు స్ప్రింక్లర్ల పరికరాలను 55శాతం రాయితీపై పొందవచ్చు. 5–10 ఎకరాల్లోపు రైతులు 45శాతం రాయితీపై పరికారలు పొందవచ్చు. రాయితీపై డ్రిప్పు, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు ఏడు సంవత్సరాల తర్వాత రెండో పర్యాయం సబ్సిడీపై పరికరాలు పొందే వేసులు బాటును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది.



బత్తాయిలో అంతర్ పంట సాగు చేసిన ఉల్లి

దరఖాస్తూ చేసుకునే విధానం

డ్రిప్పు స్ప్రింక్లర్ల పరికరాలను రాయితీ పై పొందేందుకు ఆధార్‌కార్డు, ఎమ్మార్లో ధ్రువీకరించిన భూమి యాజమాన్య పత్రం లేదా 1బి రికార్డుతో రైతుభరోసా కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో తప్పనిసరిగా రైతు తన సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలను అధికారులు నేరుగా రైతుకు ఫోన్ మెసేజ్ ద్వారా తెలియజేస్తారు. నంద్యాల జిల్లాకు చెందిన రైతులు నాన్ సబ్సిడీ మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పేరుతో కూడిన అకౌంట్ నంబరులో జమ చేయాలి.

బిందు సేద్యం లాభాదాయకం



సన్నచిన్నకారు రైతులకు బిందు సేద్యం లాభాదాయకం. ఎరువులు కూడా డ్రిప్పు ద్వారా అందించవచ్చు. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అన్ని సౌకర్యాలను కల్పిస్తూ భారీ రాయితీలను ఇచ్చి ప్రోత్సాహిస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– శివసత్యనారాయణ, నంద్యాల జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ

అధిక దిగుబడులు వస్తాయి



డ్రిప్ సేద్యంతో అధిక దిగుబడులు వస్తాయి. ఆర్‌బీకేల ద్వారా రైతులే తమకు ఏ కంపెని డ్రిప్పు పరికరాలు కావాలో ఎంపిక చేసుకోవచ్చు. ఈ సౌకర్యం ద్వారా రైతులు తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులకు పెట్టుబడి కూడ తక్కువగా ఉంటుంది. సన్న, చిన్నకారు రైతులు ఎంతో ఉపయోగకరం.
– నాగరాజు, నంద్యాల జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

మూడు ఎకరాల్లో డ్రిప్



నాకున్న మూడు ఎకరాల్లో డ్రిప్పు సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నా. ఈ విషయంపై సంబంధింత అధికారులతో చర్చించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. సబ్సిడీ పోను రైతువాటాగా రూ.28,500లు డీడీ ద్వారా చెల్లించా. త్వరలో ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు.
– సి రామమద్దిలేటి,రైతు పసుపల,బనగానపల్లె మండలం

నేటి నుంచి జాతీయ బాలికా దినోత్సవం

నంద్యాల(అర్బన్): జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు నంద్యాల జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 'ఆడ పిల్లలను రక్షించండి.. ఆడ పిల్లలను చదివించండి' అనే నినాదంతో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా పీడీ లీలావతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె మంగళవారం మాట్లాడుతూ.. మొదటి రోజు అంగన్‌వాడీ పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించడం, అంగన్‌వాడీ పరిధిలోని సచివాలయాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు. 19న ప్రతి గ్రామ సభలో సీఎస్ఆర్ బాలిక నిష్పత్తి, బాలికలకు నైపుణ్యాభివృద్ధి, గృహ సందర్శన, కొత్తగా పెళ్లయిన జంటలకు ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి తెలియజేయడం, 20న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు పోస్టర్స్ అతికించడం, స్లోగన్స్ రాయడం, చిత్రలేఖన, ఆటల పోటీలు నిర్వహించడం, 23న గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై కమ్యూనిటీ లీడర్స్‌కు అవగాహన కల్పించడం, ఆరోగ్యం, పోషకాహారం, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై తెలియజేయడం, 24న అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో గ్రామ సచివాలయాల్లో చెట్లు నాటించే కార్యక్రమంతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారోత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

20వ తేదీ వరకు బియ్యం పంపిణీ

నంద్యాల(అర్బన్): ఎండీయూ వాహనాల ద్వారా ఈనెల 20వ తేదీ వరకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆచార్యులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బియ్యం పొందని కార్డుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్లలోనే భోజనం తయారు చేయాలి

- పిక్కళ్లపల్లితండా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సీడీపీఓ
- అంగన్‌వాడీ వర్కర్‌కి మెమో జారీ

అవుకు: ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆయా అంగన్‌వాడీ సెంటర్లలోనే తయారు చేసి అందించాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండల పరిధిలోని పిక్కళ్లపల్లి తండాను సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ సందర్శించగా గ్రామస్తులు అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు సరైన సమయానికి భోజనాన్ని అందించడం లేదని ఆయన దృష్టికి తెచ్చిన విషయం తెలిసిందే. అదేవిధంగా అంగన్‌వాడీ వర్కర్ ఇంటి వద్దే భోజనాన్ని తయారు చేసుకొని వస్తుందంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం పిక్కళ్లపల్లితండా మినీ అంగన్‌వాడీ సెంటర్‌ను సూపర్‌వైజర్ నాగసుంకమ్మతో కలిసి సీడీపీఓ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన ఆమె వివరాలు లేకపోవడంతో అంగన్‌వాడీ వర్కర్ రామాంజనమ్మకు మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో భోజన తయారీ పదార్థాలు, ప్రీ స్కూల్ పిల్లల కిట్లు లేవని, ఎక్కడున్నాయని అడగ్గా ఇంటి దగ్గర ఉన్నాయంటూ అంగన్‌వాడీ వర్కర్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని చెప్పారు. స్టాఫ్, ప్రీ స్కూల్ పిల్లల హాజరు పట్టికల మినహా సర్వే రిజిష్టర్, గ్రోత్ మానిటరింగ్, టీ.హెచ్.ఆర్, ఫుడ్ స్టాక్ , గర్భిణులు, బాలింతలకు సంబంధించిన ఏ రికార్డులు లేకపోవటంతో వర్కర్‌కు మెమోను జారీ చేశామని, రెండురోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో స్టాఫ్ హాజరు పట్టికను పరిశీలిస్తున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ


సుబ్బారెడ్డికి.. మంత్రిని విమర్శించే అర్హత లేదు!

బేతంచెర్ల: కనీసం వార్డు మెంబర్‌గా గెలవలేని డోన్ టీడీపీ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించే అర్హత లేదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. పార్టీలు, కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొలుములపల్లె సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ మరియమ్మ, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొలుములపల్లె పంచాయతిలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జీవన్ చౌదరికి 3 సంవత్సరాల కాలంలో తల్లి లక్ష్మీదేవికి వైఎస్సార్ పెన్షన్ కానుక, భార్య ప్రవల్లికకు వైఎస్సార్ సున్నా వడ్డీ, పంటల బీమా, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ.1,75,018 లక్షలు వారి అకౌంట్లో జమ అయ్యిందని వివరించారు. అయితే నిజం తెలుసుకోకుండా ధర్మవరం సుబ్బారెడ్డి మా కార్యకర్త అకౌంట్లో డబ్బులు పడలేదని... మంత్రి బుగ్గన అకౌంట్లో పడ్డాయా లేక ప్రభుత్వ అకౌంట్లోనా, అధికారుల అకౌంట్లో పడ్డాయా అని మాట్లాడటం భావ్యం కాదన్నారు. జీవన్ చౌదరికి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాలు ఆధారాలతో సహ నీరుపిస్తామని, ఇప్పటికైనా సుబ్బారెడ్డి నిజా నిజాలు తెలుసుకోకుండా... స్థాయిని మరిచి మాట్లాడడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, ఎద్దులన్న, తిమ్మయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి, మురళీ, కిరణ్, రామనాయుడు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వవైభవం



ప్రహారీని విస్తరిస్తున్న దృశ్యం




గర్భగుడిపై కొత్తగా శిల్పాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో కొలిమిగుండ్ల కొండపై శిల్పకళా సంపదతో నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి పూర్వవైభవం రానుంది. కొన్నేళ్ల నుంచి ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తులకు సౌకర్యాలు తగ్గిపోయాయి. కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ కంపెనీ రూపంలో ఆలయానికి మంచి రోజులు వచ్చాయి. కంపెనీ సామాజిక బాధ్యత కింద రూ.7కోట్ల మేర వ్యయంతో ఆలయ సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. తూర్పు, పడమర ఉన్న ప్రహరీని తొలగించి భారీగా విస్తరింప చేస్తున్నారు. ప్రహారీని పకడ్బందీగా నిర్మిస్తున్నారు. ఆలయ గర్భగుడి, మండపంపై ఉన్న పాత స్లాబ్‌ను తొలగించి కొత్తగా నిర్మించారు. పురాతన ఆలయం కావడంతో శిల్పకళ ఉట్టిపడేలా చేస్తున్నారు. ఇప్పటికే గర్భగుడి లోపల గ్రానైట్‌తో బండపరుపు, స్తంభాలు ఏర్పాటు చేశారు. ఐదు అంతస్థుల గాలిగోపరంతో పాటు మెట్లు తదితర పనులు చేపట్టనున్నారు. రెండు రోజుల క్రితం ప్రహారీ పనులు పూర్తి చివరి దశకు చేరుకోవడంతో పాత గోడను తొలగించారు. ఎట్టకేలకు లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొత్త శోభ సంతరించుకోనుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్యురాలు అనురాధ అన్నదానం చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుంకన్న, స్ఫూర్తి సభ్యులతో కలిసి ఆమె రోగులు, గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో డాక్టర్లు యమున, అపర్ణ, స్ఫూర్తి సభ్యులు సీసం గుంతల ఆలా మధు, చంద్ర, రామాంజనేయులు, వసంత్, యోగి తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామంలో శనివారం ఎంపీపీ ఆధ్వర్యంలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు లబ్ధి చేకూరిందా.. లేదా అని లబ్ధిదారులను వారు అడగ్గా అన్ని పథకాలు వర్తించాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని కూడా నెరవేర్చారని తెలిపారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే మాదృష్టికి తీసుకురావాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూపి ఓర్వలేక చేస్తున్న టీడీపీ నాయకుల విమర్శలను తిప్పికొట్టాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ శ్రీవిద్య, ఎంపీటీసీ జానకిరాం, కోఆప్షన్ మెంబర్ హుసేన్, గ్రామ వైఎస్సార్ నాయకులు హుసేన్, రసూల్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ వరప్రసాద్‌రావు, ఏఈలు అబ్దుల్‌షఫీ, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న అధికారులు, నాయకులు

గిరిజన సంక్షేమం భేష్

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం, ప్రత్యేకంగా బలహీన సమూహాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కితాబిచ్చారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వెలుగోడు పట్టణానికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ప్రత్యేకంగా వైద్య, విద్య, రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యుడిని గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు రాజు నాయక్, రవి నాయక్, బాలు నాయక్, మల్లేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాము నాయక్, వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, టౌన్ ప్రధాన కార్యదర్శి నీలా నాయక్, నాయకులు నాగేష్ నాయక్, సురేష్ నాయక్, అశోక్ నాయక్, టీచర్ నాగ స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడు సాధిక్ హుస్సేన్ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కృషి చేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంజీవనాయుడు, రామాంజనేయులు, శ్రీనివాసులు, కలాం, పాపారాయుడు, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో యాచనతో జీవనం సాగిస్తున్న మైదుకూర్‌కు చెందిన శ్రీనివాసులు(40) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. పోలీసుల సూచన మేరకు ఆ నల్లురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వన్నూర్ బాషా సభ్యులతో కలిసి శ్రీనివాసులు మృతదేహాన్ని సర్వజన శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాఘవేంద్ర, అక్బర్, మా బాషా, పుల్లం రాజు, యూసుఫ్, మద్దిలేటి పాల్గొన్నారు.



శ్రీనివాసులు మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నల్లురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అలరించిన గాత్ర కచేరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన టి.నారాయణ బృందం వారి గాత్రకచేరి పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతిస్తుతి, భో..శంభో, శంభోశంకర, యోగేశ్వరాయ తదితర కీర్తనలను టి.నారాయణ, ఎం.రాము భాగవతార్, టి.మాణిక్యం, ఎం.బాలస్వామి, గోవర్ధన్, బి.మద్దిలేటి, ఆర్.మధుకుమార్ ఆలపించారు.

శ్రీశైల ఆలయం.. పుష్పశోభితం



విద్యుద్దీపకాంతులతో శ్రీశైల ఆలయం

సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీశైల ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ధ్వజస్తంభం, ఉభయ దేవాలయాలను, కల్యాణమండపంలోని సదస్యం కార్యక్రమం నిర్వహించే మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. దీంతో శ్రీశైల ఆలయం పుష్పశోభితంగా మారింది. అలాగే ఉభయ దేవాలయాల్లో గోపురాలకు, క్షేత్రంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు పలువురు భక్తులను ఆకట్టుకున్నాయి. – శ్రీశైలంటెంపుల్